ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- ఏడాదికి లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- సమాజ నిర్మాణానికి నిజమైన వాస్తు శిల్పి స్త్రీ మూర్తి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు.
- ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ దేశ ప్రగతికి దోహదపడుతుందని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు.
- పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అనుమతినిస్తూ ఆ సంస్థ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది.

===================

ఏడాదికి లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఈరోజు నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా 14,705 స్వయం సహాయక సంఘాలకు సుమారు 1,826 కోట్ల రూపాయల రుణాలను చంద్రబాబు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఇకపై ఎంత మంది పిల్లలకైనా ప్రసూతి సెలవులు ఇవ్వడంతో పాటు ఇతర ప్రయోజనాలనూ కల్పిస్తామన్నారు. చదువుకుంటున్న పిల్లలందరికీ 'తల్లికి వందనం' పథకం లబ్ధి అందిస్తామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ..

(వాయిస్ బైట్..40 సెకన్లు)- ప్రకాశం జిల్లా

===================

సమాజ నిర్మాణానికి నిజమైన వాస్తు శిల్పి స్త్రీ మూర్తి అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పవన్ కళ్యాణ్ ఈ రోజు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. కుటుంబ బాధ్యతలతో పాటు పరిపాలన, కార్యనిర్వహణ, వాణిజ్య వ్యాపారాలు, పరిశ్రమల నిర్వహణ వరకూ ప్రతి విభాగంలో మహిళామణులు తమ బాధ్యతను దిగ్విజయంగా పోషిస్తున్నారని ప్రశంసించారు. మహిళల రక్షణ, సంక్షేమం తమ ప్రభుత్వ బాధ్యతని తెలిపారు. కూటమి ప్రభుత్వం.. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేదుకు అవసరమైన అండదండలు అందిస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

===================

జాతీయ లోక్ అదాలత్ ద్వారా లభించే బహుళ ప్రయోజనాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి G.శ్రీనివాస్ కోరారు. ఈ రోజు జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, కక్షిదారులకు లోక్ అదాలత్ యొక్క ఆవశ్యకతను వివరించారు. ఈ

సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ... రాజీ మార్గమే రాజమార్గమని అన్నారు. వ్యయ ప్రయాసలు లేకుండా సత్వర న్యాయం పొందటానికి లోక్ అదాలత్ లు ఎంతో దోహదపడతాయని న్యాయమూర్తి పేర్కొంటూ..

(వాయిస్ బైట్..30 సెకన్లు)-అనంతపురం

==================

మహిళాభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. ఈరోజు చిత్తూరులో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా పురంధరేశ్వరి మాట్లాడుతూ అన్నారు.

==================

రాష్ట్రాన్ని మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వెలుగు 2.0 కార్యక్రమాన్ని రూపొందించామని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఈరోజు జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... పురుషులతో సమానంగా మహిళల్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వెలుగు పథకం ద్వారా మహిళలకు ఎన్నో అవకాశాలు కల్పించి, హామీ లేని రుణాలు అందించామన్నారు.

==================

పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పిస్తూ ఆ సంస్థ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 17వ తేదీ నుంచి పదవ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 6 లక్షల 49 వేల మంది విద్యార్థులు 3,450 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు రాయనున్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఇళ్ల నుంచి పరీక్ష కేంద్రానికి, మరలా అక్కడి నుంచి ఇంటికి చేరుకునేలా.. ఆర్టీసీ పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం అధికారులు కల్పించారు. విద్యార్థులు కేవలం హాల్‌టికెట్ చూపించి బస్సుల్లో ప్రయాణించవచ్చని తెలిపారు.

==================

విరామం

==================

ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ దేశ ప్రగతికి దోహదపడుతుందని రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు. ఈ రోజు ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో లోకేశ్ పాల్గొని మాట్లాడారు. మాతృభాషల బలోపేతానికి ఎన్డీఏ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అవకాశాల కోసం భారతీయులు ఇతర దేశ భాషలను సైతం నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. ఆధునిక ప్రపంచంలో బహుళ భాషలు నేర్చుకోవడం అవసరమని తెలిపారు. మహిళా దినోత్సవం ఒక్కరోజు మాత్రమే కాకుండా ప్రతిరోజు జరుపుకోవాలని వ్యాఖ్యానించారు. 'మనమిత్ర' పథకం ద్వారా వాట్సాప్ సేవలను ఆంధ్రప్రదేశ్ లో అందుబాటులోకి తీసుకొచ్చామని మంత్రి వెల్లడించారు. విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, టాటా పవర్‌తో 7 గిగా వాట్స్ ఒప్పందం జరిగిందని పేర్కొన్నారు. కృత్రిమ మేధ (AI) తో ప్రయాణించేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని మంత్రి లోకేశ్ తెలియజేస్తూ...

(వాయిస్ బైట్..40 సెకన్లు)-సెట్

==================

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ ఆకాంక్షించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఈ రోజు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో 2కే నడక కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం చౌక్ నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు వేలాది మందితో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ... భారతదేశ సంస్కృతిలో మాత్రమే మహిళను ఆదిపరాశక్తిగా పూజిస్తారని, పుట్టిన ప్రతీ మహిళా అందుకు గర్వపడాలని ఉద్ఘాటించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు కూడా చట్టసభల్లో ఆమోదం పొందిందని పేర్కొన్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ... ప్రతి ఇంట్లో మహిళలను దేవతల్లా చూసుకోవాలని సూచించారు.

===================

బడి బయట పిల్లలను బడికి పంపడమే తమ లక్ష్యమని స్వశక్తి పంచాయతీ నేత్ర అభియాన్ జాతీయ పురస్కార గ్రహీత, తిరుపతి జిల్లా చెర్లోపల్లి పంచాయతీ మహిళా సర్పంచ్ బొల్లినేని సుభాషిణి అన్నారు. ఢిల్లీలో జాతీయ పురస్కారాన్ని స్వీకరించిన సందర్భంగా ఆమె, ఈరోజు ఆకాశవాణితో మాట్లాడారు. పిల్లలు చదువును మధ్యలో వదిలివేయడానికి కారణాలు తెలుసుకొని పరిష్కరిస్తున్నామని ఆమె పేర్కొంటూ..

(వాయిస్ బైట్..20 సెకన్లు)- తిరుపతి

===================

పార్వతీపురం మన్యం జిల్లా, మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నుంచి యధావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో ఇకపై ప్రతి సోమవారం ఈ కార్యక్రమం జరగనున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కేంద్రం, మండలాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు ప్రజలు తమ దరఖాస్తులను అందించాలని కలెక్టర్ సూచించారు.

===================

తిరుమల శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని టీటీడీ అధికారులు తెలిపారు. ఏటా ఫాల్గుణ మాసంలో శుద్ధ ఏకాదశి నాడు ప్రారంభమయ్యే తెప్పోత్సవాలు పౌర్ణమి వరకు జరుగుతాయి. మార్చి 9వ తేదీ రాత్రి 7 గంటలకు తెప్పోత్సవాలు ప్రారంభమవుతాయి. 13వ తేది రాత్రి 7 నుంచి 8గంటల వరకు స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో ఆనందవిహారం చేస్తారు.

===================
===================